నమస్తే తెలంగాణ
నల్లగొండ
10 | నల్లగొండ, ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | NALGONDA

జీ20 సదస్సుకు ఎంజీయూ విద్యార్థి

రామగిరి, ఫిబ్రవరి 22: జీ-20 సదస్సుకు ఎంజీయూలో ఎంఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.గణేశ్ ఎంపికైనట్లు ఎంజీయూ ఆర్ట్స్, సోషల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ తెలిపారు. శనివారం విద్యార్థిని తన చాంబర్‌లో అభినందించి మాట్లాడారు. గణేశ్‌ను ఇతర విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. అభినందించిన వారిలో తెలుగు విభాగం అధ్యాపకులు జి.నర్సింహ, సత్యనారాయణరెడ్డి, అనిత ఉన్నారు.

సదస్సుకు ఎంపికైన విద్యార్థి గణేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అరుణప్రియ, అధ్యాపకులు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రైతన్నకు కాంగ్రెస్ పరీక్ష

అన్నింటిలోనూ తప్పని ఎదురుచూపులు

60శాతం దాటని రుణమాఫీ
అంతులేని కథలా రైతుభరోసా
అందులోనూ కోతలకే పెద్దపీట
సన్నధాన్యం బోనస్ డబ్బులు సగం మందికే
ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతాంగం

'ఎన్నికల సమయంలో రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి చెప్పిండు. ధాన్యానికి బోనస్ ఇస్తనన్నరు. భరోసా పెంచి ఇస్తమన్నరు. నమ్మి రైతులమంతా కాంగ్రెస్‌కు ఓటేసినం. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిండు గానీ... ఇంత వరకు నా రెండు లక్షలు రుణమాఫీ కాలేదు. ఇక 55.85 క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మితే ఇప్పటికీ బోనస్ డబ్బులు పడలేదు. రుణమాఫీ కాలేదు. బోనస్ డబ్బు రాలేదు. అందుకే నాకు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చే వరకు గాంధీభవన్ మెట్ల మీదే కూసుంట. నన్ను జైల్లో పెట్టినా భయపడేది లేదు.

– శాలిగౌరారం మండలం అంబారిపేటకు చెందిన రైతు తోట యాదగిరి ఆవేదన ఇది.

ఇది ఒక్క యాదగిరి మనోవేదనే కాదు.. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగమంతా ఇదే తరహా ఆవేదనతో కుమిలిపోతున్నారు. రైతాంగం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు చెప్తున్న మాటల్లోని డొల్లతనాన్ని అంబారిపేట రైతు తోట యాదగిరి గాంధీ భవన్ సాక్షిగా బట్టబయలు చేయడం తీవ్ర చర్చనీయంశంగా మారింది. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితిని కండ్లకు కట్టినట్లు చూపిన యాదగిరి తెగువను ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ప్రశంసిస్తున్నారు. ఇదే సమయంలో ఎన్నికల సమయంలో అడ్డదిడ్డంగా హామీలు ఇచ్చి తర్వాత వాటికి ఎగనామాలు పెట్టడమే తమ లక్ష్యం అన్నట్లుగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు రుణమాఫీ 60 శాతం దాటలేదు. బోనస్ డబ్బులు సగానికి పైగా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. రైతుభరోసా ఇప్పటికే మూడెకరాల వరకు వేసినట్లు ప్రభుత్వం చెప్తున్నా ఇందులోనూ చాలామందికి జమ కాలేదు. ఇక మిగిలిన రైతులకు సైతం ఎప్పటివరకు భరోసా డబ్బులు వేస్తారో చెప్పే నాథుడే లేడు.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ)

రుణమాఫీ పక్కకు పోయినట్లేనా?

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు జూలైలో రుణమాఫీని అమలు చేస్తున్నట్లు ప్రకటించిన నాటి నుంచి నిత్యం పొలాల్లో ఉండాల్సిన రైతులు అంతకుమించిన సమయాన్ని బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగడానికే వెచ్చించాల్సి వచ్చింది. అందుక్కారణం ప్రహసనంగా మారిన రుణమాఫీనే. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 60 శాతానికి మించలేదు. మిగతా 40శాతానికి పైగా రైతులు రుణమాఫీ కోసం గత ఆగస్టు 15 నుంచి ఎదురుచూస్తూనే ఉన్నారు. అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆగస్టు నుంచి అదిగో... ఇదిగో రుణమాఫీ అంటూ ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం నవంబర్ నెలాఖరులో కొద్దిమందితో నాలుగో విడత జాబితా ప్రకటించి చేతులు దులుపుకొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాలుగు విడతల రుణమాఫీలో కలిపి 3.75లక్షల మంది రైతులకే రుణమాఫీ అయ్యింది. జిల్లాలో కనీసం మొత్తం ఐదున్నర లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారని అంచనా. ఆ లెక్కన ఇంకా కనీసం 1.75 లక్షల మందికి పైనే రుణమాఫీ కావాల్సిన వారు ఉంటారు. రేషన్ కార్డు లేని వాళ్లు, ఒక కుటుంబంలో ఉన్న వ్యక్తులకు రెండు లక్షలకు మించి రుణం ఉన్న వాళ్లు, ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టాదార్ పాస్‌పుస్తకం నెంబర్లతోపాటు పేర్లు సరిపోలకపోవడం వంటి కారణాలతో వీరిని ప్రభుత్వం పక్కన పెట్టింది. రేషన్ కార్డు లేని రెండు లక్షల లోపు రుణమాఫీ వాళ్లకు నాలుగో విడతలో ప్రకటించారు. కానీ ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాస్‌పుస్తకం, లోన్ అకౌంట్ నంబర్లలో తప్పులు లేదా పేర్లు సరిపోలకపోవడం వంటి కారణాలతో లక్ష లోపు రుణమాఫీ కానివాళ్లు కూడా ఇంకో 35 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. ఇక రెండు లక్షల కుపైగా రుణం ఉన్న రైతుల సంఖ్య లక్షన్నరకుపైగానే ఉన్నట్లు సమాచారం. వీరంతా రైతు తోట యాదగిరి మాదిరిగానే ఎదురుచూస్తున్నారు.

గాంధీభవన్ సాక్షిగా రైతన్న ఆవేదన అక్షర సత్యం

శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఎదుట పాస్‌బుక్‌లతో నిరసన తెలిపిన రైతు తోట యాదగిరి (ఫైల్)

అంతులేని కథలా రైతుభరోసా

రైతుభరోసాగా ఎకరాకు ప్రతి సీజన్‌లో రూ.7,500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తూచ్ అంటూ 6 వేల ఇస్తానని ప్రకటించింది. అది కూడా ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతున్నది. గత నెల 26 నుంచి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పి ఇప్పటి వరకు కేవలం మూడెకరాల వరకు ఉన్న రైతులకే జమ చేయడం గమనార్హం. ప్రభుత్వం ఎకరాకు రూ.7,500 చొప్పున ఇస్తే ఉమ్మడి జిల్లా రైతులకు రూ.1,950 కోట్ల పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. కానీ గత యాసంగిలో 5వేల చొప్పున, వానకాలంలో అసలే ఇవ్వకుండా ప్రస్తుత యాసంగిలో రూ.6వేల చొప్పున ఇస్తామని చెప్పింది. గత యాసంగిలో 5వేలు మాత్రమే ఇవ్వడం వల్ల సుమారుగా రూ.650 కోట్లను, వానకాలంలో రూ.1950 కోట్లను, ప్రస్తుతం రూ.400 కోట్లను రైతులకు ప్రభుత్వం ఎగమానం పెట్టింది. ప్రస్తుతం ఇస్తామన్న 6 వేల భరోసా డబ్బులు కూడా ఎప్పటివరకు పూర్తి చేస్తారన్నది స్పష్టత లేదు. ఇప్పటికే మూడు విడతలుగా మూడెకరాల వరకు వేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ 3 ఎకరాల్లోపు రైతుల్లోనూ 70శాతం మంది రైతులకే భరోసా డబ్బులు జమ అయినట్లు సమాచారం. చాలామంది రైతులకు ఉన్న విస్తీర్ణానికి తగ్గట్లుగా భరోసా డబ్బులు జమకాలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఒక రైతుకు ఒక రెవెన్యూ గ్రామం కంటే ఎక్కువ గ్రామాల్లో భూములు ఉంటే అన్ని కలిపి వచ్చే విస్తీర్ణం సమయంలోనే భరోసా ఇస్తామంటూ మెలిక పెట్టింది. గతంలో మొత్తం విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఏ గ్రామంలో ఎంత విస్తీర్ణం ఉన్నా... ప్రభుత్వం విడుదల చేసే విస్తీర్ణం పరిధి రాగానే రైతుబంధు డబ్బులు జమ అయ్యేది. కానీ ప్రస్తుతం రకరకాల కొర్రీలతో ఎగనామం పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం తీరు కనిపిస్తున్నది. కేసీఆర్ సర్కార్ నాటి లెక్కల ప్రకారం చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 26లక్షల ఎకరాలకు గానూ 11 లక్షల మంది రైతులకు రైతుభరోసా అందాలి. కానీ వారందరికీ ఎప్పటివరకు భరోసా డబ్బులు పడతాయన్నది ఎవరూ చెప్పే పరిస్థితి లేదు.

పెండింగ్‌లో రూ.47.86 కోట్ల బోనస్

సన్నధాన్యం ధాన్యం విక్రయించి రెండున్నర నెలలు గడుస్తున్నా... నేటికీ సగం మంది రైతులు తమకు రావాల్సిన బోనస్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఇదిగో.. అదిగో అంటుండడంతో నిత్యం రైతులు బ్యాంకుల చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తున్నది. ఉమ్మడి జిల్లాలో 10 వేల మందికి పైగా రైతులకు రూ.47.86 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వంపై నమ్మకం లేకనే... బోనస్ వద్దనుకునే ఉమ్మడి జిల్లా రైతులు సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకే విక్రయించారు. చివర్లో కొంత మంది రైతులు మాత్రం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నాలను అమ్మారు. నల్లగొండ జిల్లాలో మొత్తం రూ.172.59కోట్ల విలువైన 74,393 మెట్రిక్ టన్నుల సన్నాలను 15,879 మంది రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో నేటికీ 37,186 మెట్రిక్ టన్నులకు సంబంధించి 8110 మంది రైతులకు రూ.37.60 కోట్ల బోనస్ పడాల్సి ఉంది. సూర్యాపేట జిల్లాలో 1.18లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలను కొనుగోలు చేయగా వీటికి సంబంధించి రూ.59కోట్ల రూపాయల బోనస్ రైతులకు చెల్లించాల్సి ఉండగా నేటికీ రూ.29 కోట్ల బోనస్ పెండింగ్‌లోనే ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో కొనుగోలు చేసిందే చాలా తక్కువ. 1,171 మంది రైతుల నుంచి 4,647 మెట్రిక్ టన్నుల సన్నాలనే కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి నేటికీ రూ.2.32 లక్షల బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. సాక్షాత్తూ పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకే నేటికీ సన్నధాన్యం బోనస్ డబ్బులు పడకపోతే ఇతర జిల్లాల రైతుల పరిస్థితి ఏంటన్నది అర్థం చేసుకోవచ్చు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం

- ఇన్‌లెట్ వైపు టీబీఎం తవ్వకం పనులు
- కొద్దిసేపటికే కూలిపడిన మట్టిదిబ్బలు
- సొరంగంలోనే చిక్కుకుపోయిన 8 మంది
- రక్షించేందుకు అధికారుల తీవ్రయత్నాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన నల్లగొండ కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగ మార్గం ఇన్‌లెట్ వైపు తవ్వకాల పనుల్లో శనివారం ఉదయం ప్రమాదం జరిగింది. శ్రీశైలం రిజర్వాయర్‌కు ఆనుకుని నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద సొరంగ మార్గం ఇన్‌లెట్ మొదలవుతుంది. ఇటువైపు నుంచి ఇన్నాళ్లు శ్రీశైలంలో నీటి నిల్వలు ఉండ డం వల్ల నీటి ఊటతో తవ్వకాలు నిలిచిపోయాయి. రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడం వల్ల నాలుగు రోజుల కిందట టీబీఎంతో పనులు తవ్వకాలు మొదలుపెట్టారు. శనివారం ఉదయం 8 గంటలకు టీబీఎం పనులు మొదలయ్యాయి. సరిగ్గా 30నిమిషాల్లోనే ఒక్కసారిగా పనులు మొదలుపెట్టిన చోట నీటి ఊటతోపాటు మట్టిదిబ్బలు కూలడం మొదలైంది. 150 మీటర్ల మేర ఇలాంటి పరిస్థితి తలెత్తడంతోపాటు క్షణాల్లోనే పెద్దశబ్దం కూడా వచ్చి నీటితో కూడిన మట్టిదిబ్బలు టీబీఎం మీద పడిపడ్డాయి. ఈ సమయంలో టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) మీద ఉన్న వాళ్ల తోపాటు వెనుక భాగంలో విధులు నిర్వర్తిస్తున్న వాళ్లు వెంటనే కొద్దిదూరం వెనక్కి వచ్చేశారు. దాంతో ప్రమాదం నుంచి బయటపడగలిగారు. కానీ అప్పటికే టీబీఎం ముందు భాగంలో తవ్వకం పనుల్లో నిమగ్నమైన ఎనిమిది మంది మాత్రం అందులోనే చిక్కుకుపోయారు. ఇందులో ఒక ప్రాజెక్టు ఇంజినీర్, ఇక సైట్ ఇంజినీర్, ఇద్దరు మిషన్ ఆపరేటర్లతోపాటు మరో నలుగురు కార్మికులు ఉన్నారు. వీరిని సురక్షితంగా కాపాడేందుకు అధికారులు రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు అధికారులు అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రాత్రి వరకు వీరి ప్రయత్నాలు కొనసాగుతున్నా అప్పటికే కూలిన ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోవడం, మట్టిదిబ్బలతో పాటు నీరు పేరుకుపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నట్లు తెలిసింది. రాత్రి వరకు ఆర్మీ రెస్క్యూ టీమ్ కూడా ఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు చేపట్టారు. ఇటీవల ఉత్తరాఖండ్ సొరంగంలో చిక్కుకుపోయిన సందర్భంలో రెస్క్యూ చేసిన ప్రత్యేక బృందాలను సైతం రప్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్‌పై ఆదివారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దోమలపెంట వద్ద ప్రమాదం జరిగిన ఇన్‌లెట్ స్థలాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, అందుకు గల కారణాలను అక్కడి ఇంజనీర్లతోపాటు ప్రమాదం నుంచి బయటపడిన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, ఏసీపీ మౌనిక ఉన్నారు.

మరో 9 కిలోమీటర్లు

ఎల్ఎల్‌బీసీ సొరంగ మార్గం 43 కిలోమీటర్ల మేర టీబీఎం మిషన్‌తో తవ్వాల్సి ఉంది. శ్రీశైలం వైపు నుంచి(ఇన్‌లెట్) ఒక టీబీఎం మిషన్‌తో మన్నెవారిపల్లి(అవుట్‌లెట్) నుంచి మరో టీబీఎం మిషన్‌తో ఏకకాలంలో సొరంగం తవ్వకం పనులు మొదలుపెట్టారు. శ్రీశైలం నిండిన ప్రతీసారి కొన్ని నెలల పాటు నీటిఊటతో తవ్వకం పనులకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల ఇప్పటివరకు అటువైపు నుంచి 13.956 కిలోమీటర్ల మేర మాత్రమే సొరంగం పూర్తయ్యింది మన్నెవారిపల్లి వైపు నుంచి సుమారు 20కిలోమీటర్ల మేర పూర్తయ్యింది. మరో 9 కిలోమీటర్లకు కొంచెం అటూఇటుగా సొరంగం తవ్వాల్సి ఉంది. దీని కోసం ఇన్‌లెట్ వైపు నుంచి శ్రీశైలం నీటి ఊట తగ్గడంతో నాలుగు రోజుల కిందట పనులు మొదలుపెట్టారు. కానీ అవుట్‌లెట్ వైపు ఉన్న టీబీఎంలో బేరింగ్ ఫెయిల్ అవ్వడంతో కొద్ది నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఈ బేరింగ్ అమెరికాలోని రాబిన్‌సన్ కంపెనీ నుంచి రావాల్సి ఉండగా అది చెన్నై పోర్ట్‌కు చేరుకున్నట్లు తెలిసింది. ఇది కూడా ప్రాజెక్టు స్థలానికి చేరుకుంటే అవుట్‌లెట్ వైపు నుంచి కూడా పనులు మొదలుకానున్నాయి. రెండు మిషన్లు నిత్యం పని చేస్తే నెలకు ఒక కిలోమీటర్ మేర సొరంగం పనులు పూర్తి చేయవచ్చని అధికారులు చెప్తున్నారు. కానీ సొరంగ మార్గం డిజైనే అత్యంత క్లిష్టమైంది అవడంతో పనుల కొనసాగింపుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. దాంతో తరుచూ పనుల్లో అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయి.

మిల్లర్ల అక్రమాలపై సీబీఐ విచారణ!

- సూర్యాపేట జిల్లాలోని 10 మిల్లుల్లో రూ.515 కోట్ల ధాన్యం మాయంపై ఆరా
- ప్రాథమిక విచారణ పూర్తయినట్లు సమాచారం
- ఓ ఎన్జీఓ ఫిర్యాదుతో రంగంలోకి..

సూర్యాపేట, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లాలో అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మాయం చేసిన అక్రమార్కులపై విచారణకు సీబీఐ రంగంలోకి దిగినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని మిల్లర్లకు ఇస్తుండగా ఓ పది మిల్లులు తీసుకున్న దాదాపు రూ.515 కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యం మాయం చేశాయి. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆర్ ఆర్ యాక్ట్‌తోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి మిల్లులు సీజ్ చేయడంతోపాటు మిల్లర్లను జైలుకు పంపారు. కానీ, మిల్లర్లు మాత్రం చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని బెయిల్‌పై వచ్చిన తరువాత మిల్లులను యథావిధిగా తెరిచి వ్యాపారం చేస్తున్నారు. దాంతో ఓ ఎన్‌జీఓ కేంద్ర ప్రభుత్వం, సీబీఐకి ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రంగంలోకి దిగిన సీబీఐ అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల సమాచారం తీసుకొని ప్రాథమిక విచారణ పూర్తి చేసినట్లు తెలుస్తున్నది. సూర్యాపేట జిల్లాలో మిల్లర్లకు నాయకుడిగా ఉన్న వ్యక్తి మరో పదిమందితో పానల్ తయారు చేసి వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని ఖతం పట్టించిన విషయం విదితమే. అధికారులు అడిగినంత ఇచ్చి వందల కోట్ల రూపాయల ధాన్యాన్ని మాయం చేసినట్లు అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు తనిఖీలు చేసినా సదరు మిల్లుల్లో ధాన్యం ఉన్నట్లు రికార్డుల్లో చూపించడం, ఆయా మిల్లుల నుంచి సీఎంఆర్ రాకున్నా పట్టించుకోకపోవడంతో పది మిల్లుల బకాయి పెద్దఎత్తున పోగుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టడం, నీటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కరువు చాయలు అలముకున్నాయి. దాంతో పంట తగ్గి మిల్లులకు ధాన్యం వెళ్లకపోవడంతో మిల్లర్ల పాపాల పుట్టలు పగులుతూ వచ్చాయి. సీబీఐ ఇప్పటికే సూర్యాపేట అధికారుల నుంచి ప్రాథమికంగా వివరాలు సేకరించిందని, త్వరలోనే అక్రమాలకు పాల్పడిన మిల్లర్లతోపాటు వారికి సహకరించిన అధికారులకు కూడా విచారణ తప్పదని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. విచారణ ఎలా ఉంటుంది, తిన్న సొమ్మంతా కక్కిస్తారా? కేసులు తప్పవా? అని అక్రమార్కులు బెంబేలెత్తిపోతున్నట్లు సమాచారం.

కృష్ణా జలాల్లో నిక్కచ్చి వాటా కోసం
పోరాటాలకు బీఆర్ఎస్ సిద్ధం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఫిబ్రవరి 22 : కృష్ణా జలాల్లో నిక్కచ్చి వాటా పరిరక్షణ, రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా హాలియాలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో ఆంధ్రా జలదోపిడీ యథేచ్ఛగా కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలన అనుభవం లేదని, అలాంటి వ్యక్తి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం కొనసాగడం మన దౌర్భాగ్యమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు కూడా ఆయా శాఖలపై విషయ పరిజ్ఞానం లేదన్నారు. కృష్ణా జలాల వినియోగం విషయంలో రాష్ట్ర పునర్విభజన సమయంలో ఇరు రాష్ట్రాల మధ్య తాత్కాలిక ఒప్పందం జరిగిందని తెలిపారు. దానిని ఉల్లంఘించి నేడు ఆంధ్రా ప్రాంతం వారు కేఆర్ఎంబీని మభ్యపెట్టి కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృష్ణా జలాలను అక్రమంగా తీసుకుపోతుంటే తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా నాగార్జునసాగర్ జలాశయం నుంచి 11 వేల క్యూసెక్కుల నీళ్లు ఆంధ్రా ప్రాంతానికి పోతున్నాయని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మునుపెన్నడూ లేని విధంగా సాగర్ డ్యామ్ పైన సీఆర్‌పీఎఫ్ బలగాలను పెట్టినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ జలాశయాన్ని కేఆర్ఎంబీకి అప్పగించడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో కేఆర్ఎంబీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనుకూల నిర్ణయాలు తీసుకొని అమలు చేయడం వల్ల తెలంగాణ ప్రాంత ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాత ప్రభుత్వం కండ్లు తెరిచి కేఆర్ఎంబీకి లేఖ పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, ఆంధ్రా జలదోపిడీ మూలంగా గతేడాది నాగార్జున సాగర్ జలాశయంలో సాగుకు సరిపడా నీరు లేక ఎడమ కాల్వ కింద ఒక్క నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆంధ్రా జలదోపిడీకి అడ్డుకట్టవేయాలని కోరారు. ఈ ఏడాది సాగునీరు అందక నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద గుంట పొలం ఎండిపోయినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కృష్ణా జలాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టి, తెలంగాణ ప్రాంత రైతాంగ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటాలకు సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైనందున రాష్ట్ర ప్రభు త్వం ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

సాగునీటి కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా

- పంటలను కాపాడాలని రైతుల వినతి
- సాగునీరు లేక 20 వేల ఎకరాల పంట ఎండుతుంది : సీపీఎం

సూర్యాపేట, ఫిబ్రవరి 22 : సాగు నీటి కోసం పెన్‌పహాడ్, మునగాల మండలాల రైతులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు అందకపోవడంతో రెండు మండలాల పరిధిలో 20 వేల ఎకరాలకు పైగా వరి ఎండి పోతున్నందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి భూముల వరకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మునగాల, పెన్‌పహాడ్ మండలాల రైతులు కొంత కాలంగా కంటికి నిద్ర లేకుండా నీటి కోసం కాపలా కాస్తున్నారని తెలిపారు. పెద్ద కాల్వ నుంచి నీటిని కిందికి రాకుండా తూములు మూసివేస్తున్నారని పేర్కొన్నారు. దాంతో చివరి భూములు ఎండిపోతున్నాయని ఆందోళ వ్యక్తం చేశారు. ఎండిపోయిన ప్రతి ఎకరాకూ ప్రభుత్వం రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యంగా ఉన్న ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నెమ్మాది పీరయ్య, శీవాజీ, లాల్, రాములు, గోపి, సుధాకర్, వెంకట్‌రెడ్డి, రవి, సీతారాంనాయక్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు



రాజాపేట : పొట్టిమర్రి వాగులోకి దిగి నిరసన తెలుపుతున్న రైతు జేఏసీ నాయకులు

కాళేశ్వరం నీళ్లు అందించాలి

పొట్టిమర్రి వాగులో రైతుల నిరసన

రాజాపేట, ఫిబ్రవరి 22 : కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా సాగు నీరు అందించాలని మండలంలోని పొట్టిమర్రి వాగులో శనివారం రైతు జేఏసీ ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ మాట్లాడుతూ తలాపునే కాళేశ్వరం జలాలు పారుతున్నా రాజాపేట ప్రాంతం మాత్రం ఏడారి మారిందన్నారు. ప్రభుత్వం కాళేశ్వరం జలాలతో గొలుసు కట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో రైతు జేఏసీ నాయకులు సట్టు తిరుమలేశ్, చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, గుంటి కృష్ణ, మేక వెంకటేశ్వర్‌రెడ్డి, ఎడ్ల నరేశ్‌రెడ్డి, కుమ్మరి లక్ష్మణ్, కాకల్ల ఉపేందర్, బీరప్ప, భిక్షపతి, రమేశ్, ఉప్పలయ్యగౌడ్, బాలకృష్ణ, నర్సయ్య, అకంతి సుదర్శన్, కొయ మధు, నర్సింహులు పాల్గొన్నారు.